ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 9: జిల్లాలో నూతన పండ్లతోటల పెంపకం కోసం ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లాఉద్యానవన శాఖా ధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అరటి, బొప్పాయి, మామిడి పంటలు పండించేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు మూడు సంవత్సరాల పాటు రాయితీ ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఆసిఫాబాద్ డివిజన్ రైతులు అబ్దుల్‌నదీం(8977713964), కాగజ్‌నగర్ డివిజన్‌రైతులు సుప్రజ(8977713965) నంబర్లను సంప్రదించాలన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన జిల్లా నాయకులు



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూరు/కాగజ్‌నగర్, సెప్టెంబరు 9: కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని సోమవారం హైదరాబాద్‌లో జిల్లా బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, బాలకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గజమాలతో ఆయనను సత్కరించారు. అనంతరం జిల్లా పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సీహెచ్‌సీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 9: ఆసిఫాబాద్ సీహెచ్‌సీ హాస్పిటల్‌లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించాలని సీనియర్ అసిస్టెంట్‌కు సోమవారం కార్మికులుఉ వినతిపత్రం అందజేశారు. మూడునెలలుగా వేతనాలు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు మల్లేష్, సత్తర్, మురళీ, గుణవంతరావు, మమత, సీఐటీయూ నాయకుడు దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

కెరమెరి, సెప్టెంబరు 9: ఏజెన్సీచట్టాలను పకడ్బందీగా అమలుచేయాలని ఆదివాసీలు డిమాండ్‌చేశారు. జైనూరులో జరిగినఘటన నేపథ్యంలో మండల కేంద్రంలోని ఆదివాసీభవన్‌లో ఆదివాసీలు, గిరిజనసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీప్రాంతాల్లో ఆదివాసీచట్టాలు అయినపీసా,1/70యాక్టులను అమలు చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపారంచేసే గిరిజనేతరులు చట్టాలకు లోబడివ్యాపారం నిర్వహించుకోవాలని సూచించారు.సమావేశంలో నాయకులు మోతీరాం, అబ్దుల్‌కలాం, విజయ్,అంబారావు,ప్రభాకర్, జగన్నాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీకి తీరని చింత



వాంకిడిలో పిచ్చిమొక్కలతో ఉన్న వైకుంఠధామం

- శ్మశాన వాటికల్లో కనీససౌకర్యాలు కరువు
- విద్యుత్, నీటి సదుపాయం లేక నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు
- అంత్యక్రియలకు అవస్థలు

వాంకిడి, సెప్టెంబరు 9: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దహన సంస్కారాలకు ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు గతప్రభుత్వం ప్రతీ పంచాయతీలో వైకుంఠధామం నిర్మించాలని నిర్ణయించింది. ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేస్తూ ఇందుకోసం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ నిర్ణయం ఘనంగా ఉన్నా క్షేత్రస్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఒక్కో శ్మశాన వాటిక నిర్మాణానికి రూ.12.50లక్షలు వెచ్చించినా వీటి నిర్వహణలేక జిల్లాలో నిర్మించిన శ్మశాన వాటికలు అలంకారప్రాయంగా మారాయి. శ్మశాన వాటికలను నిర్మించిన అధికారులు నీటిసౌకర్యం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో వినియోగంలో లేకుండాపోయాయి. ఇదే అదునుగా తీసుకుంటున్న ఆకతాయిలు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. జిల్లాలో 335 పంచాయతీలు ఉండగా 334పంచాయతీల్లో వైకుంఠధామాలు నిర్మించారు.

పర్యవేక్షణ కరువు..

జిల్లాలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన శ్మశానవాటికలపై పర్యవేక్షణ కరువైంది. శ్మశాన వాటికలు నిర్మించిన అధికారులు వాటి నిర్వహణను మర్చి పోయారు. శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీలు, సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉన్నా నేటి వరకు నిర్మించలేదు. ఉపాధిహామీ నిధులతో వసతులు కల్పించాలని గత ప్రభుత్వం ఆదేశించినా పంచాయతీ అధికారుల పర్యవేక్షన లేకపోవడంతో వైకుంఠధామాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయి. పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో నిర్మించాల్సిన శ్మశాన వాటికలు గ్రామాల్లో, ఊరికి దూరంగా వాగుల ఒడ్డున సరైన దారులులేని ప్రాంతంలో నిర్మించారు. అనేక గ్రామాల్లో వాగుఒడ్డున నిర్మించిన వైకుంఠధామాలు వరదలకు కొట్టుకు పోయాయి. శ్మశాన వాటికలకు వెళ్లడానికి సైతం సరైనదారులు లేకపోవడంతో అటువైపు వెళ్లడం కూడా కష్టంగా మారింది. స్థలాల ఎంపిక విషయంలోనూ అధికారులు హడావిడి చేసి నిబం ధనలు పాటించలేదనే విమర్శలు ఉన్నాయి.

విద్యుత్ సదుపాయం లేక..

జిల్లాలో నిర్మించిన వైకుంఠధామాలకు ఇప్పటి వరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీంతో అంత్యక్రియల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఊరికి దూరంగా ఉండడంతో విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు భారీగా నిధులు వెచ్చించాల్సి ఉంటుందని విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తులు చేసుకోవడం లేదని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

శ్మశానవాటికలను వినియోగంలోకి తీసుకురావాలి
అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ, వాంకిడి



గ్రామాల్లో, పట్టణాల్లో శ్మశాన వాటి కలు లేక దహన సంస్కారాలకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో నిర్మించిన శ్మశా న వాటికలకు విద్యుత్,నీటి, మౌలికవసతులు లేక నిరు పయోగంగా ఉన్నాయి. ప్రభుత్వం శ్మశాన వాటికలకు విద్యుత్, నీటి, మౌలిక సదుపాయాలు కల్పించి వినియోగం తీసుకురావాలి. దహన సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి.

అంత్యక్రియలకు ఇబ్బందులు

జిల్లాలో నిర్మించిన శ్మశానవాటికలు ఊరికి దూరంగా ఉండడం, విద్యుత్, నీటివసతి, ఇతర మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామాల్లో, పట్టణాల్లో అంత్యక్రియలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊరికి సమీపంలో ఖాళీస్థలాల్లో, వాగుల సమీపంలో ఉన్న గ్రామాల్లో వాగు ఒడ్డున అంత్యక్రియలు జరుపుకుంటున్నారు. వర్షాకాలంలో వాగులు, వరదల కారణంగా అంత్యక్రియలకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు మెరుగు పర్చి, వైకుంఠధామాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 9: ప్రజాసంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దాసరి వేణు, శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాగజ్‌నగర్‌కు సబ్‌కలెక్టర్‌ను నియమించినందున డివిజన్‌లో జరిగే సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులలో అధికారులు తమవంతు సహకారం అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున మండల ప్రత్యేకాధికారులు పారిశుధ్యంపై దృష్టిసారించాలన్నారు. బావులు, నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయాలని తెలిపారు. గ్రామాలల్లో విషజ్వరాల నియంత్రణపై పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అనుమానితుల నుంచి రక్తనమునాలు సేకరించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కారం దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు..

ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తగుచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బెజ్జూరు మండలం పోతెపల్లికి చెందిన సురేష్ తాను సహకారసంఘంలో రుణం పొందక పోయినా తీసుకున్నట్లు చూపుతున్నారని, ఈ విషయంలో విచారణ జరిపి తనకున్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు. కౌటాల మండలం వీరవెల్లికి చెందిన హీరామన్ తనతండ్రి పేరిట ఉన్న భూమిని విరాసత్ చేయాలని, చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్‌కు చెందిన శంకర్ తాను బెజ్జూరు సహకార సంఘంలో రుణం పొందకపోయినా రుణం తీసుకున్నట్లు చూపుతున్నారని ఈవిషయంలో న్యాయం చేయాలని కోరారు.

బెజ్జూరు మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీబాయి తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నూతన పాసు పుస్తకం మంజూరు చేయాలని, కాగజ్‌నగర్ మండలం బోడపల్లి గ్రామానికిచెందిన 55 కుటుం బాలు ఇళ్లు నిర్మించుకొని ఉన్నామని, కొందరు అక్రమ పట్టా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంలో విచారణ జరపాలని అర్జీ సమర్పించారు. బోడపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య, శంకర్ తమ తల్లి పేరుతో ఉన్నభూమిని ఇతరులు అక్రమంగా పట్టా చేసుకున్నారని విచారణ జరిపి న్యాయం చేయా లని కోరారు. రెబ్బెన మండలం పులికుంట గ్రామానికి చెందిన సుజాత జాతీయరహదారి నిర్మాణంలో తనకు రావాల్సిన నష్టపరహారాన్ని వేరొకరు పొందారని, ఈ విషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. తిర్యాణి మండలం గంభీరావుపేట గ్రామానికి చెందిన బాపు తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు.

జైనూరులో ముమ్మరంగా వాహనాల తనిఖీ



జైనూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

జైనూరు, సెప్టెంబరు 9: జైనూరులో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు 144సెక్షన్ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. కాలేజీగూడ నుంచి దుబ్బగూడ చౌరస్తా వరకు మధ్య మధ్యలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి జైనూరుకు వచ్చే వారిని అనుమతించడం లేదు. జైనూరు, సిర్పూర్ (యు), లింగాపూర్ ప్రాంతాలకు చెందిన వారిని మాత్రమే ఆధార్‌కార్డు చూపిస్తే వదిలి పెడుతున్నారు. పాత్రికేయులను సైతం రానివ్వడం లేదు. పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తూ ఉద్యోగులను మాత్రమే విధులు నిర్వహించడానికి రాకపోకలకు అనుమతిస్తున్నారు. కొత్తవారికి ఎలాంటి అనుమతి ఇవ్వడం లేదు. రాత్రి వేళల్లో సైతం ముమ్మరంగా పెట్రోలింగ్ చేస్తున్నారు.

శ్రమదానంతో కల్వర్టుకు మరమ్మతులు



కల్వర్టుకు మరమ్మతులు చేస్తున్న గ్రామస్థులు

తిర్యాణి, సెప్టెంబరు 9: మండలంలోని భీంజీగూడ గ్రామపంచాయతీ పరిధిలోని బుగ్గగూడ గ్రామ సమీపంలోని కల్వర్టు అనుసంధానరోడ్డు ఇటీవల కురిసినవర్షాలకు తెగిపోయింది. దీంతో సోమవారం పంగిడిమాదర పరిధిలోని గ్రామస్థులు శ్రమదానంచేసి రాళ్లతో గుంతను పూడ్చి మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్రోచ్‌రోడ్డు తెగిపోయి కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో 16గ్రామాలప్రజలు సమావేశమై శ్రమదానంతో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కల్వర్టుకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.



ఐఎన్‌టీయూసీకి ప్రాతినిధ్య హోదా



గుర్తింపు పత్రం అందుకుంటున్న జనక్‌ప్రసాద్

మంచిర్యాల/శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, సెప్టెంబరు 9: సింగరేణి ప్రాతినిధ్య హోదాపత్రాన్ని సోమవారం సీఎండీ బలరాంనాయక్ ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు అందజేశారు. 2023డిసెంబరు 27నజరిగిన సింగరేణిఎన్నికల్లో ఐఎన్టీయూసీ14,178ఓట్లతో సింగరేణివ్యాప్తంగా ఉన్న11ఏరియాల్లో 6స్థానాల్లో మెజార్టీ సాధించింది. ఇందుకుగాను రెండేళ్ల కాలపరిమితితోకూడిన ప్రాతినిధ్యహోదా ఐఎన్టీయూసీకి ఇవ్వగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జనక్‌ప్రసాద్ అందుకున్నారు. జనక్‌ప్రసాద్ విజ్ఞప్తి మేరకు కార్మికనాయకులకు త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని సీఎండీహామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీవైసీఎల్‌సీ శ్రీనివాసులు, ఐఎన్టీయూసీ సెంట్రల్‌వైస్‌ప్రెసిడెంట్‌లు నరసింహారెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, శంకర్‌రావు, రాజేందర్, జనరల్‌సెక్రటరీలు త్యాగరాజన్, అక్రం, క్యాంపెనింగ్ ఇంచార్జి వికాస్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి తలొగ్గిన యాజమాన్యం : హెచ్‌ఎంఎస్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 9: సర్ఫేస్‌జనరల్‌మజ్దూర్ పోస్టుల భర్తీలో గుర్తింపుయూనియన్, రాజకీయనాయకుల ఒత్తిడికి యాజమాన్యం తలొగ్గిందని హెచ్‌ఎంఎస్ ఏరియాఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒకప్రకటనలో ఆరోపించారు. 108సర్ఫేస్ జనరల్‌మజ్దూర్ పోస్టుల భర్తీచేసేందుకు అర్హులకుఅన్యాయం జరిగిందన్నారు. సీనియార్టీ ప్రాతిపదికన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. అండర్‌గ్రౌండ్ అలవెన్సులు తీసుకోకుండా సర్ఫేస్‌లో యాక్టింగ్‌చేస్తున్న కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. యాక్సిడెంట్ బాధితులకు కేవలం 10శాతం మాత్రమే కేటాయించడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. పైగాఇప్పటివరకు జాబితాను బయటపెట్టకపోవడం అవకతవకలు జరిగాయనేదానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా అధికారులు నిష్పక్షపాతంగా సర్ఫేస్ మజ్దూర్ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కన్వేయన్స్ డ్రైవర్స్‌కు మద్దతు తెలపండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 9: సింగరేణి కన్వేయన్స్‌డ్రైవర్స్‌కు మద్దతు తెలపాలని సింగరేణికాంట్రాక్టు కార్మికసంఘం(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ తెలిపారు. కన్వేయన్స్ డ్రైవర్లకు మద్దతుగా శ్రీరాంపూర్ ఓసీపీలో బెల్ట్‌క్లీనింగ్ కాంట్రాక్ట్‌కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వర్తించారు. కన్వేయన్స్ డ్రైవర్లకు అరకొరవేతనాలు ఇస్తూ అద్దెవాహనాల యజమానులు లాభపడుతున్నారని ఆరో పించారు. డ్రైవర్ల న్యాయమైన పోరాటానికి తాము ఎల్లవేళలా మద్దతుగా నిలుస్తామన్నారు. సింగరేణి అధికారులు చర్యలు తీసుకొని, డ్రైవర్లకు తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బెల్ట్‌క్లీనింగ్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయవద్దు: అదనపు కలెక్టర్



ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూర్(టి), సెప్టెంబరు 9: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని సాంఘికసంక్షేమ బాలుర పాఠశాలలో ఆదివారం జ్వరాలు సోకి చికిత్స పొందిన విద్యార్థులను పరామర్శించారు. అలాగే సోమవారం మరో ఎనిమిదికి జ్వరాలు సోకడంతో వారిని తక్షణమే సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సబ్‌కలెక్టర్ ఆసుపత్రికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అస్వస్థతకుగురైతే తక్షణమే ప్రభుత్వ సామాజికఆసుపత్రికి తరలించి సేవలు అందించాలన్నారు. ఆయనవెంట రీజనల్ డైరెక్టర్ అరుణరాణి, డీపీవో ఉమర్‌హుస్సేన్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా గురుకులంలోకి విలేకరులను అనుమతించకపోవడంతో గేటుకు తాళం వేయడంపై అదనపు కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాను అనుమతించాలని సిబ్బందికి సూచించారు.

పండుగలు సామరస్యంగా జరుపుకోవాలి



సిర్పూర్(టి)లో సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బెజ్జూరు/సిర్పూర్(టి), సెప్టెంబరు 9: పండుగలు సామరస్యంగా జరుపుకోవాలని తహసీల్దార్లు భూమేశ్వర్, శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో వారు గణేష్ నవరాత్రుల నిర్వాహకులు, ముస్లిం మతపెద్దలతో శాంతికమిటీసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్‌ఉన్‌నబీ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి తుకారాం, ఆలయకమిటీ అధ్యక్షుడు మహేష్, మసీద్ అధ్యక్షుడు అమీరుద్దీన్, శ్రీనివాస్, హకీం, జావీద్, సిర్పూర్(టి)లో ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై, గిర్దావర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు చేస్తే కేసులు నమోదు చేస్తాం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 9: జైనూరు సంఘటనకు సంబంధించి వివాదాస్పద పోస్టులను ఫేస్‌బుక్‌లో, వాట్సాప్, తదితరాల్లో పోస్టు చేస్తే కేసులు నమోదు చేస్తామని పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు చేసి ప్రశాంత వాతావరణానికి ఇబ్బంది కలుగజేస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

కాగజ్‌నగర్, సెప్టెంబరు 9: కాగజ్‌నగర్ మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ కాసర్ల శ్రీనివాస్(56) సోమవారం మృతి చెందాడు. కొద్దిరోజుల క్రితం ఆయనకు జ్వరం వచ్చింది. సోమవారం పరిస్థితి విషమంగా మారటంతో కాగజ్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులసూచనల మేరకు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనమృతికి పాలకవర్గ సభ్యులు సంతాపం ప్రకటించారు.

జిల్లాలో ముసురు వాన



చింతలమానేపల్లి: లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న దిందా వాగు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 9: జిల్లాలో ఆదివారంరాత్రి నుంచి ముసురువాన కురుస్తోంది. జిల్లావ్యాప్తంగా 12.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు జిల్లాలోని ఆయా మండలాల్లో ఓమోస్తరు వర్షంకురిసింది. అత్యధికంగా బెజ్జూరు మండలంలో 31.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా సిర్పూర్(యు)లో 1.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. మిగితా మండలాలైన పెంచికలపేటలో 25.7మిల్లీమీటర్లు, చింతలమానేపల్లిలో 20.6, దహెగాంలో 20.3, కౌటాలలో 16.8, రెబ్బెనలో15.7, ఆసిఫాబాద్‌లో 12.5, సిర్పూర్(టి)లో 11.8, తిర్యాణిలో 10.6, కాగజ్‌నగర్‌లో 9.8,వాంకిడిలో8.8, కెరమెరిలో 2.8మిల్లీమీటర్ల వర్షపాతంనమోదు అయింది. కాగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండగా కుమరంభీం ప్రాజెక్టు రెండుగేట్లు, వట్టివాగు ప్రాజెక్టు ఒకగేటు పైకిఎత్తి వరద నీటిని అధికారులు కిందికి వదులుతున్నారు.



పెంచికలపేటలో కూరుకుపోయిన వాహనాన్ని తోస్తున్న గ్రామస్థులు

బెజ్జూరు/ చింతలమానేపల్లి/ పెంచికలపేట/దహెగాం: సోమవారం ఉదయం నుంచి మండలాల్లో ఎడతెరిపిలేని ముసురు వాన కురిసింది. ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేదు. గ్రామాలరోడ్లు బురదమయంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చింతలమానేపల్లి మండలంలోని కేతిని-దిందా గ్రామాల మధ్య వాగు ఉప్పొంగిప్రవహించడంతో దిందాగ్రామ ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి

రెబ్బెన, సెప్టెంబరు 9: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు. పోషణ మాసాన్ని పురస్కరించుకొని కొండపల్లిలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ విధిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. దీంతో శరీరంలో సమతుల్యత ఏర్పడుతుందన్నారు. అంగన్‌వాడీకేంద్రాల నుంచి సరఫరా చేస్తున్న బాలామృతాన్ని పిల్లలకు తప్పకుండా తినిపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ సంతోషి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిర్పూర్(టి), సెప్టెంబరు 9: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం మండలాధ్యక్షురాలు కాంతమ్మ, కార్యదర్శి బుజ్జమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో మాట్లాడుతూ మధ్యాహ్నభోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంఆర్వోలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు విజయ, లక్ష్మి, ఆశక్క, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

కాసిపేట, సెప్టెంబరు 9 : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి మడావి గంగారం అన్నారు. సోమవారం మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి గ్రామపంచాయతీల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కాసిపేటలో మిషన్ భగీరథ పైపు లైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. రోడ్లపై నుంచి ప్రవహిస్తున్న వాగుల వద్దప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని, ఫాగింగ్ చేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

జైపూర్, సెప్టెంబరు 9: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన దుర్గం శివమ్మ(77) సోమవారం తెల్లవారుజామున పాముకాటుతో మృతి చెందింది. శివమ్మ తెల్లవారుజామున చలి వేస్తుందని దుప్పటి కావాలని అడిగింది. కూతురు దుప్పటి ఇవ్వగా చేతి మణికట్టుకు విష పురుగు కుట్టిందని శివమ్మ పేర్కొంది. వెంటనే కూతురు, అల్లుడు ఆటోలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శివమ్మ పాముకాటుతో మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కూతురు పద్మ, అల్లుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హబీబ్ పేర్కొన్నారు.

నేతకాని హక్కుల సాధనే ధ్యేయం

దండేపల్లి, సెప్టెంబరు 9: నేతకాని కులస్థుల హక్కుల సాధనే ధ్యేయంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బిక్కునగూడ నేతకాని మహర్ సంక్షేమ సంఘం కమిటీని ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో నేతకానిలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. గ్రామ అధ్యక్ష కార్యదర్శులుగా దుర్గం గంగారాం, రాయటెంకి అంజన్న, గౌరవ అధ్యక్షులుగా దర్శనాల గంగారామ్, ఉపాధ్యక్షులుగా రాం టెంకి రాజన్న, కామెర శంకర్, కోశాధికారిగా కామెర రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శుగా దుర్గం దుర్గయ్య, బల్లపల్లి రాజలింగు, ప్రచార కార్యదర్శులుగా దుర్గం తిరుపతి, కామెర దుర్గయ్య, ప్రధాన సలహాదారులుగా తాళ్లపెల్లి రాములు, కామెర రాజ్‌కుమార్, తాళ్లపెల్లి సర్సింగంలను ఎన్నుకున్నారు.

భారీ వర్షం : దెబ్బతిన్న రోడ్లు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 9: పట్టణంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి పాల చెట్లు సమీపంలోని కోల్‌బెల్ట్ రోడ్డు కోతకు గురైంది. మూడు అడుగుల లోతు గుంతపడింది. వర్షాలకు పట్టణంలోని చాలా చోట్ల రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. పోస్టాఫీసు సమీపంలోని రోడ్డు కోతకు గురికాగా కోతకు గురైన గుంతలో పడి ఏరియాలోని సింగరేణి సర్వేఅధికారి గాయాల పాలయ్యాడు. రామన్‌కాలనీ, మార్కెట్ సెంటర్‌లోని హనుమాన్ ఆలయం ఎదుట నీరు నిల్వడంతో ప్రజలుఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటిలో మునిగిన చేతిపంపు

కాసిపేట, సెప్టెంబరు 9: పల్లంగూడ గ్రామ పంచాయతీలోని బంజరు దొడ్డి సమీపంలో ఉన్న చేతి పంపు నీటిలో మునిందీ. అయినప్పటికీ ఈ నీటినే తాగుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు చేతి పంపువద్ద వరదనీరు నిలిచింది. సమీపంలో ఎక్కడ చేతి పంపు లేకపోవడంతో కలుషిత నీటినితాగి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చేతి పంపు నీరు తాగి నాలుగు కుటుంబాలు జ్వరాల బారినపడ్డారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపు వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

బెల్లంపల్లి, సెప్టెంబరు 9: మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన సెంట్రింగ్‌కార్మికుడు కంపెలరాము(32) సోమవారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం రాము సెంట్రింగ్‌పనులు చేసేవాడు. కొన్నేండ్లుగా మతి స్థిమితం సరిగ్గా ఉండడంలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కొన్నిసందర్భాల్లో తానుచనిపోతానని కుటుంబీకులను బెదిరించేవాడు. పిల్లలు కౌశిక్, దీపక్‌కు జ్వరంరాగా భార్యమాయ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

చినుకు పడితే కునుకు కరువు

- డ్రెయినేజీలతో ముంచుకొస్తున్న ముప్పు
- వర్షం వస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి వస్తున్న మురుగు నీటి ప్రవాహం
- మరమ్మతులు లేక, డ్రెయినేజీలు సరిపోక..




మురుగు నీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 9:కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కాలనీలు భారీ వర్షాలు వస్తే ముంపునకు గురవుతున్నాయి. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30వార్డులుండగా 40వేల జనాభా కలిగి ఉంది. అయితే మున్సిపాలిటీ పరిధిలోని ఆయావార్డుల్లోని అనేక నాళాలు భారీవర్షాలు కురిస్తే ఉప్పొంగి ఇండ్లలోకి మురుగు నీరు చేరుతోంది. నాళాలలో సరైన పూడిక తీయకపోవడంతో పాటు దశాబ్దాల క్రితం నిర్మించిన నాళాలు ప్రస్తుత జనాభాకు సరిపోవడం లేదు. మురుగు నీరు, వరద పెద్ద ఎత్తున రావడంతో చిన్నగా ఉన్ననాళాల్లో నీరుపట్టక నాళాలు ఉప్పొంగి ప్రవాహిస్తున్నాయి. కాగజ్‌నగర్‌లో డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వర్షాలకు రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ప్రధానంగా డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, ఇతరవ్యర్థాలు మురుగునీటి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. అదేవిధంగా ఉన్ననాళాలు కబ్జాకు గురికావడం మరో సమస్యగా మారింది.

ప్రధానంగా ఇందిరా మార్కెట్ సమీపంలోని డి సంజీవయ్య కాలనీ పక్కనే ఉన్న ప్రధాన నాళా చినుకుపడితే ఆయాకాలనీవాసులకు కునుకు లేకుండా చేస్తోంది. ఎప్పుడు వర్షంవచ్చినా కూడా నాళా ఉప్పొంగి మురికి నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయాకాలనీలు నీటమునిగి పోతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మోకాళ్ల లోతుగా నీరు పారుతుండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ప్రస్తుతం ఉన్న జనాభా పరంగా చూస్తే గృహాలు పెరిగిపోయి, నాళాలోకి వస్తున్న మురుగునీరుకు సరిపోయడంలేదు. దీంతోపాటు నాళాపై గత రెండు సంవత్సరాల క్రితం కట్టిన వంతెన కూడా డిజైన్ లోపం కారణంగా వరదనీరు రోడ్లపైకి చేరుతోందని ఆయాకాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. గత నెలలో అర్ధరాత్రి కురిసిన వర్షంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసి అపార నష్టం కలిగించింది.

బాలాజీనగర్‌లోనూ ఇదే పరిస్థితి..

పట్టణంలోని బాలాజీనగర్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం కురిసిన భారీవర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి మురుగు నీరంతా రోడ్లపైకి చేరింది. దీంతో వాహనాలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఒక్క భారీ వర్షానికే డ్రెయినేజీలు పొంగి రోడ్లపైకి నీరు చేరి మోకాళ్ల లోతు నీటిలో అవస్థలు పడాల్సిన పరిస్థితి. అలాగే రోడ్లపై నడిచి వెళ్లాలన్నా ఎక్కడ పడిపోతామోనని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. వరదనీటితో సముద్రాలను తలపించే రోడ్లు, పారే మురుగునీటితో సహవాసం చేయాల్సి వస్తోందని ఆయాకాలనీలవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. భారీ వర్షాలకు పట్టణంలోని సర్‌సిల్క్, మార్కెట్ ఏరియా, సంజీవయ్య కాలనీ, బాలాజీ నగర్, శ్రీనగర్‌కాలనీ, కాపువాడ, పెట్రోల్ పంపు తదితర ఏరియాల్లో ఇళ్లలోకి నీరుచేరుతోంది. డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతోనే ఇండ్లలోనికి నీరు చేరుతోంది. రాత్రి వేళల్లో భారీ వర్షం కురిస్తే ముంపునకుగురయ్యే ప్రమాదం నెలకొందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

-అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

డ్రైయినేజీల వలన ఇబ్బందులు తలెత్తే ప్రాంతాల్లో ప్రత్యేక సర్వేలు చేపట్టి చర్యలు తీసుకుంటాం. అవసరమున్న చోట మరమ్మతులు చేపడుతాం. డ్రైనేజీలు, పెద్ద నాళాల సమీపంలో, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

పశువులకు రేడియం స్టిక్కర్లు



రేడియం బెల్టులను కడుతున్న పోలీసులు

చెన్నూరు, సెప్టెంబరు 9: చెన్నూరు పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాత్రివేళల్లో పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువులు సంచరిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు ఆదివారం రాత్రి పశువుల మెడకు రిఫ్లెక్టివ్ రేడియం బెల్టులను పెట్టారు. సీఐ రవీందర్ మాట్లాడుతూ పశువుల యజమానులు పశువులను ఇండ్ల వద్ద కట్టేసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

కాసిపేట, సెప్టెంబరు 9 : జిల్లాలోని కొలాంగూడలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కొలాం సేవా సంఘం జిల్లా కార్యదర్శి ఆత్రం మహేష్ అన్నారు. సోమవారం పెద్దాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్య, వైద్యం మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా భీంరావు, ప్రధాన కార్యదర్శిగా భీంరావు, గౌరవాధ్యక్షులుగా కొడప భీంరావు, సభ్యులను ఎన్నుకున్నారు.

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం



కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న అదనపు కలెక్టర్, వేమనపల్లిలో నివాళులర్పిస్తున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 9: ప్రజా కవి కాళోజీ నారాయణరావు రచనలు, ఆచరించిన జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కాళోజీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కత్తి కన్న కలం గొప్పదని కాళోజీ నిరూపించారన్నారు. అధికారులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోఆర్డినేటర్ సోమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: తెలంగాణ యాసకు ప్రాణం పోసిన మహనీయుడు ప్రజాకవి కాళోజీఅని ప్రధానోపాధ్యాయులు అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. తహసీల్దార్ రమేష్, పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మదుకర్, సూపర్‌వైజర్ సువర్ణ, సుజాత, లచ్చయ్య పాల్గొన్నారు.

జైపూర్: తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. తహసీల్దార్ వనజారెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ తొలిపొద్దు ప్రజాకవి కాళోజీ నారాయణరావు హక్కుల కోసం పోరాడిన ప్రజల మనిషి అని పేర్కొన్నారు. ఆర్‌ఐ తిరుపతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్: సాహితీ స్రవంతి లక్షెట్టిపేట ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. నూటెంకి రవీంద్ర కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ టెన్నిసన్, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: తెలంగాణ కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని పాత మంచిర్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి తెలంగాణ భాష గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సంగీత, ఉపాధ్యాయులు చందు, సాగర్, మంజుల, శ్రీనివాస్, సురేష్‌బాబు, కరీమా, పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటగాళ్ల బైండోవర్



వేటగాళ్లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

వేమనపల్లి, సెప్టెంబరు 9: రాత్రివేళల్లో విద్యుత్ తీగలను అమర్చి వన్యప్రాణులను వేటాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోమవారం బైండోవర్ చేసినట్లు నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. సూరారం గ్రామానికి చెందిన కుడిమేత రాజు, చంద్రగౌడ్, తలండి సురేష్, దుర్గం శ్రీను, కుడిమేత మధునయ్యలు కొంత కాలంగా వన్య ప్రాణులను వేటాడుతున్నారనే నమ్మదగిన సమాచారంతో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఐదుగురిని తహసీల్దార్ రమేష్ ఎదుట హాజరుపరచి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చి వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

యువతి ఆత్మహత్య

హాజీపూర్, సెప్టెంబరు 9: మండలంలోని బుద్దిపెల్లి పంచాయతీ పరిధి కొండాపూర్ గ్రామానికి చెందిన ఎనగందుల జ్యోత్స్న(22) సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. జ్యోత్స్న డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. తల్లి, చెల్లెలు ఇంటికి వచ్చిచూసే సరికి ఉరి వేసుకుని కనిపించింది. స్థానికుల సాయంతో మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ సురేష్‌ను సంప్రదించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 9: పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన గాదె శ్రీనివాస్ (55) ఆదివారం రాత్రి పాలవాగులో పడి మృతి చెందాడు. శ్రీనివాస్ కూలీ చేసుకుని జీవిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్ళి సోమవారం వరకు ఇంటికి రాలేదు. దీంతో భార్య పాలవాగు సమీపంలోని మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లి చూడగా గుడి పక్కన చెప్పులు, గొడుగు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు వాగు వద్దకు వెళ్ళి చూడగా పాలవాగు మూలమలుపు వద్ద గల కల్వర్టులోని నీటిలో మృతదేహం కనిపించడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో వాగులో పడి మృతిచెంది ఉంటాడని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య , కుమార్తె ఉన్నారు.

భూముల వివరాలు తెలపాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం, సెప్టెంబరు 9: మండలంలోని ప్రభుత్వ భూములు, చెరు వులు, కుంటలు మత్తడికి సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని భూముల వివరాలు తెలపాలని సోమవారం ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ మండల చైర్మన్ విజయధర్మ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, చెరువుల విస్తీర్ణం, మిగులు భూముల వివరాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నాయకులు విజయ్, సత్యం, మహేష్, తిరుపతి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



చున్నంబట్టిలో గణపతి మండపం వద్ద మాట్లాడుతున్న సీపీ

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 9: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని చింతపండువాడలోని సిద్ది వినాయకున్ని దర్శించుకుని పూజలు చేశారు. వంద ఫీట్ల రోడ్డులోని అంజనీపుత్ర గణేష్ మండపంతోపాటు పలు గణపతి మండపాలను సందర్శించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు. గణపతి శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలుంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐలు బన్సీలాల్, అశోక్, అంజనీపుత్ర ఎండీ పిల్లి రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కిషన్, సదానందం పాల్గొన్నారు.

దండేపల్లి: వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణేష్ మండపాల వద్ద విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. రామాలయం వినాయక మండపం వద్ద ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా పూజలు చేశారు, సిద్ది వినాయక మండ పం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నారు.

నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై ఉదయ్‌కిరణ్ సూచించారు. పోలీసుస్టేషన్‌లో వినాయక నవరాత్రుల సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద డీజేలు పెట్టి ఇబ్బంది పెట్టవద్దన్నారు. మండపాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని పోలీసులకు తెలియజేయాల న్నారు. కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాల న్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు, మత పెద్దలు ఉన్నారు.

కాసిపేట: పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. కాసిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. గణపతి మండపాల నిర్వహకులు నిబంధనలు పాటించాలని సూచించారు. విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అందరు సహకరించాలని కోరారు. ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చెన్నూరు: గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డీసీపీ భాస్కర్ కోరారు. పట్టణంలోని పెద్ద చెరువు నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలతోపాటు నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. నిమజ్జనంపై సంబంధిత అధికారులతో చర్చించారు. నిమజ్జన ఘాట్ వద్ద విద్యుత్ లైట్లతోపాటు క్రేన్, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. చెన్నూరు, రూరల్ సీఐలు రవీందర్, సుధాకర్, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, విద్యుత్ ఏఈ శ్రీనివాస్, కౌన్సిలర్లు ఉన్నారు.

జైపూర్: వినాయక నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని డీసీపీ భాస్కర్ సూచించారు. ఇందారం గోదావరి బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్ల వివరాలను శ్రీరాంపూర్ సీఐ మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. డీసీపీ మాట్లాడుతూ ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ శ్రీధర్, పోలీసులు పాల్గొన్నారు.

భీమారం: గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని భీమారం గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు మండల పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కొత్తగూడెం సమీపంలోని కొత్త చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 16న నిమజ్జనం ఉన్నందున ఏర్పాట్లు చేయాలని కోరారు. చెరువు వద్ద క్రేన్ ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు ప్రవీణ్,ప్రణీత్, రుద్రశర్మ, రంజిత్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.



చెనూరు చెరువు కట్ట వద్ద డీసీపీ, గోదావరి వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

చిన్నపుల్లార గ్రామంలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

వాంకిడి, సెప్టెంబరు 9: మండలంలోని చిన్నపుల్లార గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరాలతో బాధపడుతున్న ఎనిమిదిమంది రక్తనమునాలను సేకరించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ భగవన్‌దాస్, గోదావరి పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

వాంకిడి, సెప్టెంబరు 9: ప్రజాకవి అక్షర యోధుడు కాలోజీ నారాయణ రావు జయంతిని సోమవారం మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో చంద్రయ్య, అధ్యాపకులు శ్రీధర్, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ విజేతతో గిరిజన క్రీడాకారులు



ఒలింపిక్ విజేత దీప్తితో ఆసిఫాబాద్ విద్యార్థినులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 9: ఇటీవల ప్యారిస్ పారాఒలింపిక్స్‌లో కాంస్యపథకం సాధించిన జీవాంజి దీప్తితో ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థినులు అంజలి, సాక్షి సెల్ఫీ దిగారు. వీరుకూడా దీప్తి శిక్షణ తీసుకుంటున్న నాగపురిరమేష్ వద్దనే కోచింగ్‌లో ఉన్నారు. వీరుకూడా ఒలంపిక్‌స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీవో కుష్బూగుప్తా, డీడీరమాదేవి, ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీఓ శకుంతల తదితరులు ఆకాక్షించారు.

నీటిగుంతలో పడి ఒకరు మృతి



షేక్ హుస్సేన్(ఫైల్)

సిర్పూర్(టి), సెప్టెంబరు 9: మండలకేంద్రంలోని న్యూకాలనీకి చెందిన షేక్‌హుస్సేన్(50) ఆదివారం రాత్రి తన ఇంటి సమీపంలో ఉన్న నీటిగుంతలో పడి మృతి చెందాడు. ఏఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్‌హుస్సేన్ తన సోదరి ఇంటికి వెళ్తున్న సమయంలో నీటిగుంతలో ప్రమాదవశాత్తుపడి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడిసోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

జైనూరు ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి

జైనూరు, సెప్టెంబరు 9: జైనూరు ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి సోమారం బాధ్యతలు చేపట్టారు. కెరమెరి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన జైనూరుఎంపీడీవోగా నియమితులయ్యారు. ప్రస్తుతంఇక్కడసిర్పూర్ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఇన్‌చార్జీగా పని చేస్తున్నారు.

కబ్జా కోరల్లో ప్రభుత్వ స్థలాలు

- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ మడిగెల స్థలంపై కన్ను
- అనాథల భవనాన్ని సైతం కబ్జాచేసిన ఘనులు



కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని మడిగెల స్థలం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 9: పట్టణంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండాపోతోంది. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోఉన్న కోట్లు విలువ చేసే స్థలాన్నికబ్జాచేసేందుకు యత్నిస్తున్నారు. అదే విధంగా అనాథలు రాత్రి బసచేసేందుకు నిర్మించే భవన స్థలాన్నికూడా కబ్జాచేశారు. ఇంతజరుగుతున్నా జిల్లాఅధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

సర్వే నెంబరు 147/2లో..

మున్సిపాలిటీకి కూతవేటు దూరంలో ఉన్న ప్రభుత్వ స్థలంపై కొంతమంది నాయకులు కన్నేశారు. సమస్య లేకుండా ఉండేందుకు కలిసికట్టుగా ఈస్థలాన్ని కొట్టేసేందుకు పన్నాగం పన్నా రు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని సర్వేనెంబరులో 147/2లో 2013లో రూ.6లక్షలతో చిన్నపాటి మడిగలు 14ను నిర్మించేందుకు టెండరుపిలిచి పనులు చేశారు. కాని ఈస్థలం తమదని ప్రయివేటు వ్యక్తికోర్టును ఆశ్ర యించటంతో పెండింగ్‌లో ఉంది. పట్టణంలో ఈ స్థలానికి భారీడిమాండు ఉండ టంతో ప్రణాళికబద్దంగా ఈ స్థలాన్ని కాజేసేందుకు యత్నిస్తున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీలోని కొందరు సిబ్బందితో కలిసి స్థలానికి ఇంటి నెంబరు 1-16-552/4/3/ఎ/1 సంపాదించారు. ఈఇంటి నెంబరుతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే అసలు ఇల్లు లేకున్నా మున్సిపల్ అధికారులు ఇంటి నెంబరు కేటాయించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనిపై పైఅధికారులకు ఫిర్యాదు చేయటంతో ఏకంగా ఇంటినెంబరును ఆఘమేఘాల మీద రద్దు చేశారు. అయితే ఆ ఇంటి నంబరు కేటాయించిన అధికారులపై ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదు.

ఫిర్యాదులు రాగానే స్పందిస్తున్నాం..

- అంజయ్య కమిషనర్, కాగజ్‌నగర్



ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇంటి నెంబర్ల కేటాయింపులో ఫిర్యాదులు రాగానే రద్దు చేస్తున్నాం. కబ్జాలు చేసినట్లు తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వ స్థలమని తెలిసిన కూడా..

అదేవిధంగా కాగజ్‌నగర్ సర్వే నెంబరు 143లోని 1000 చదరపు గజాల ఖాళీస్థలాన్ని అనాథలు రాత్రిళ్ల బస చేసేందుకు భవనం నిర్మించాలని మున్సిపల్ అధికారులు గతంలో ఏర్పాట్లు చేశారు. ఇందుకు నిధులు కూడా మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉండగా కాగజ్‌నగర్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు ఈ స్థలంలో దర్గాగా ప్రహరీని నిర్మించారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించటం లేదని ఆయా కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వెంటనే స్పందించి కబ్జా దారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెబ్బెనలో పూర్తయిన ఓటరు జాబితా సవరణ

- వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం



ఓటరు జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

రెబ్బెన, సెప్టెంబరు 9: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వం వచ్చే జనవరిలోపు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే అవకాశాలు కన్పిస్తున్నాయి. అసెంబ్లీ పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న ఓటర్లను గ్రామ పంచాయతీల వారిగా క్రోడీకరించటంతోపాటు వార్డుల వారిగా ఓటర్ల జాబితాను తయారు చేసే పనిలో అధికారులు బీజీబీజీగా ఉన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలుండగా వాటిపరిధిలో 214 వార్డులున్నాయి. జనవరి 1, 2024 నాటికి మండలంలో మొత్తం 28,332మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల వరకు పంచాయతీల్లోని ఓటర్లు వివిధ వార్డుల వారీగా ఉండేవారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఒకే కుటుంబంలో ఓటర్లు వివిధ పోలింగ్ స్టేషన్లకు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకునేవారు. దీంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యేవారు. అయితే ఈ సారి కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే వార్డులో ఓటు హక్కు వినియోగించుకునేలా జాబితా సవరించారు. సవరించిన ఓటర్ల జాబితాను శుక్రవారం గ్రామపంచాయతీలో వార్డుల వారీగా ప్రచురించాల్సి ఉండగా ప్రభుత్వం ఈనెల13వరకు అవకాశం కల్పించింది. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఓటర్ల జాబితాను నమోదు చేశారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సైతం పూర్తికాగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా జాబితాను ప్రచురించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓటరు జాబితాను ఆన్‌లైన్ చేశాం..

-శంకరమ్మ, ఎంపీడీవో, రెబ్బెన

మండలంలోని గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ఆన్‌లైన్ చేశాం. ఒక కుటుంబంలోని సభ్యులంతా ఒకే వార్డులో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నాం. ఇక మిగిలింది ఓటరు జాబితాను పబ్లిష్ చేయడమే.

మహిళపై కేసు నమోదు

దహెగాం, సెప్టెంబరు 9: మండలంలోని గిరివెల్లి గ్రామానికి చెందిన పెంటక్కపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. పెంటక్క తన ఇంటిముందు గొర్రెలకు వేసిన సూదులు, డబ్బాలు పడేశారని బాసబోయిన అంకుబాయి, ఆమె కూతురు మీనాక్షిని దూషించింది. అంకుబాయిపై దాడిచేసి కడుపులో కొట్టడంతో ఆపరేషన్ చేయించుకున్న ఆమెకు నొప్పి తీవ్రమైంది. బాధితురాలు అంకుబాయి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

28న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 9: జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో ఈ నెల28న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీమార్గాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, ఆబ్కారీ, సివిల్ కుటుంబ సంబంధిత, ఎన్‌ఐ యాక్టు తదితర న్యాయస్థాన సంబంధిత కేసులను పరిష్కరిస్తామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధానన్యాయాధికారి ఎంవీ రమేష్, సీనియర్ సివిల్‌జడ్జి యువరాజా, జూనియర్ సివిల్‌జడ్జి అనంతలక్ష్మి న్యాయాధికారులుగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకేసులను రాజీమార్గంద్వారా పరిష్కరిం చుకోవచ్చని తెలిపారు.

వేతనసవరణ నివేదిక విడుదల చేయాలి

పెంచికలపేట, సెప్టెంబరు 9: ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతనసవరణ కమిటీనివేదకను వెంటనే విడుదలచేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస రావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కరువు బత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరంమండలకమిటీని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయనిర్మల, గంగాభవాని, ఉదయ్‌కిరణ్, ఆత్మారావు, అత్తబ్, షాహేబ్, ఉపేంద్ర, హార్శియా తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడిజిల్లా పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 9: ఆసిఫాబాద్ జడ్పీఎస్‌ఎస్ బాలుర పాఠశాలకు చెందిన మహేష్, సాయిచరణ్ ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ జిల్లాప్రధానకార్యదర్శి శ్యాంసుందర్‌రావు, రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పీడీ విద్యాసాగర్, ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులను అభినందించారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

మంగళవారం 10 సెప్టెంబరు 2024

కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకం
ఘనంగా జయంతి
7లో..

7లో..
గణపతి మండపాల నిర్వాహకులు
నిబంధనలు పాటించాలి

ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం అందజేత



గుర్తింపు పత్రం అందుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు

మంచిర్యాల/శ్రీరాంపూర్/మందమర్రి టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీకి ఎట్టకేలకు యాజమాన్యం గుర్తింపు పత్రం అందజేసింది. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన ఎనిమిది నెలల సుదీర్ఘ సమయం తరువాత సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ బలరాం గుర్తింపు పత్రాన్ని అందజేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌లు సీఎండీ చేతుల మీదుగా గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం ఇవ్వడంతోనే బాధ్యత తీరినట్లు కాకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా గతంలో ఉన్న విధంగా గుర్తింపు కాలపరిమితి నాలుగు సంవత్సరాలు ఉండాలని ఏఐటీయూసీ కోరినప్పటికీ యాజమాన్యం రెండేళ్లకే కాలపరిమితి ఇవ్వడం వల్ల కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభావం పడుతుందన్నారు. నాలుగు సంవత్సరాల గుర్తింపు కాలపరిమితి కోసం ఏఐటీయూసీ న్యాయ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. యూనియన్ కేంద్ర నాయకులతోపాటు అన్ని ఏరియాల సెంట్రల్ ఆఫీస్ బేరర్లు, బ్రాంచి కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించడంలో అలసత్వం వద్దు



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిపై నమ్మకంతో చికిత్స కోసం వచ్చే పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అలసత్వం వహించవద్దని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే అన్ని వార్డులు పరిశీలించారు. ఆయన రోగులతో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలు, మందులు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతూ వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఏడాదిన్నర సమయంలో ఐబీ ప్రాంగణంలో కార్పొరేట్ స్థాయి వైద్యశాల ఏర్పాటు అవుతుందని తెలిపారు. హైదారాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. మంచిర్యాల జిల్లాతోపాటు ఆసిఫాబాద్, నిర్మల్, మహారాష్ట్ర వాసులకు ఉత్తమ వైద్య సేవలు అందుతాయన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చెరువు కట్ట వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి

చెన్నూరు, సెప్టెంబరు 9: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, చికున్ గున్యా, డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తంచేశారు. లైన్‌గడ్డ చెరువు కట్ట ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్‌కమిషనర్ గంగాధర్ ఉన్నారు.

కోటపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలోని ఆల్గామ గ్రామంలో పర్యటించారు. గ్రామస్థులతో ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.

ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 9: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిందని సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వం పొందడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం పలువురు న్యాయవాదులు బీజేపీ సభ్యత్వం తీసుకోగా వారికి సభ్యత్వం అందించారు. నాయకులు పోశం, కృష్ణమూర్తి, అశోక్, వెంకటకృష్ణ, శ్రీదేవి, రమేష్, రజనీ, ప్రభాకర్, శ్రీదేవిపాల్గొన్నారు.

నియామకం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 9 : జాతీయ బీసీ సంక్షేమం సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణంలోని మార్కెట్ ఏరియాకు చెందిన కొండిళ్ల శ్రీనివాస్ నియమితులయ్యారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్‌కు శ్రీనివాస్‌కు నియామక పత్రం అందించారు.



అక్రమాలకు నిలయంగా మారిన మంచిర్యాల

నిత్యకృత్యమైన జూదం, వ్యభిచారం, సెటిల్‌మెంట్లు

గంజాయి, మారణాయుధాల రవాణా

జోరుగా అసాంఘిక కార్యక్రమాలు

అసాంఘిక కార్యక్రమాలకు జిల్లా కేంద్రం అడ్డాగా మారింది. జూదం, వ్యభిచారం, సెటిల్‌మెంట్లు, గంజాయి వినియోగం, మారణాయుధాల రవాణా నిత్యకృత్యమైంది. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి అక్రమార్కులు వచ్చి ఇక్కడ దందాలు నిర్వహిస్తున్నారు. ఓ వైపు పోలీసు దాడులు జరుగుతున్నా.... మరో వైపు యథేచ్ఛగా అక్రమ దందాలు కొనసాగుతున్నాయి.

మంచిర్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ నాటి నుంచి మంచిర్యాల వేగంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి ఉద్యోగులు, వ్యాపారస్తులు జిల్లా కేంద్రంలో స్థలాలు కొనుగోలు చేస్తూ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ నగరం వేగంగా విస్తరిస్తోంది. జన సంచారం పెరుగుతుండటంతో అక్రమ దందా, అసాంఘిక కార్యక్రమాలు కూడా అడ్డగోలుగా విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు, పట్టా భూములు కబ్జా చేయడం, నిర్మాణాలు చేపట్టడం, ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురి చేయడం పెరిగిపోతున్నాయి. భూ దందాలో నెలకొంటున్న వివాదాలను సెటిల్ చేయడానికి గ్యాంగ్‌స్టర్లు అవతరించారంటే అతిశయోక్తికాదు. సెటిల్ మెంట్లతో స్థానికంగా భయానక వాతావరణం నెలకొంది. యువకులను చేరదీసి, వారిని మద్యం, గంజాయి సేవనంతో పెంచి పోషిస్తూ విచ్చలవిడిగా సెటిల్‌మెంట్లు చేస్తున్నా అడిగే వారు కరువయ్యారు. వివిధ రకాల వివాదాల్లో తలదూరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

జూదంలోనూ టాప్....

జిల్లాలో జూదం జోరుగా సాగుతోంది. పోలీసుల తనిఖీల్లో పలువురు పట్టుబడుతున్నారు. ఈ నెల 8న రాత్రి మార్కెట్ ఏరియాలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 10 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దాడుల సందర్భంగా రూ. 52,320 నగదు, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పట్టుబడ్డ వారిలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యక్తులు ఉండటం గమనార్హం. గత నెల 9న అశోక్ రోడ్డులోని ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా ఏడుగురు పట్టుబడ్డారు. బెల్లంపల్లి, జైపూర్ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోనూ పేకాట దందా కొనసాగుతోంది. గత నెల 10న బెల్లంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురు, తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది మంది, కోటపల్లి పోలీస్ పరిధిలోని రావన్‌పల్లి అటవీ ప్రాంతంలో ఏడుగురు, పారుపెల్లి శివారులో పేకాడుతున్న నలుగురు, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చెట్లపొదల్లో పేకాట ఆడుతుండగా ఆరుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.

నిత్యకృత్యమైన వ్యభిచారం....

జిల్లా కేంద్రంలో వ్యభిచారం ఈ మధ్యకాలంలో నిత్యకృత్యమైంది. బెల్లంపల్లి చౌరస్తాలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడికి చెందిన సాయి రెసిడెన్సీ లాడ్జీలో ఇటీవల వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు.

20 రోజుల వ్యవధిలో అదే లాడ్జిలో పలు పర్లు వ్యభిచారం చేస్తూ పట్టుబడటం సంచలనం సృష్టించింది. మొదటి సారి లాడ్జి ఓనరే ఇద్దరు మహిళలతో వ్యభిచారం చేస్తూ పట్టుబడగా, ఈ నెల 7న వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు మహిళలతో వ్యభిచారం చేస్తూ పోలీసులకు చిక్కారు. సదరు లాడ్జిలో రెండు గంటలు రూం బుక్ చేస్తే రూ.1100 చార్జీ వసూలు చేస్తున్నారు. జన్మభూమి నగర్‌లోని ఓ గెస్ట్‌హౌజ్‌లో స్థానికులు కొందరు వ్యభిచారం చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. అయితే పోలీసుల దృష్టికి వచ్చింది కొన్ని సంఘటనలే అయినా గుట్టుచప్పుడు కాకుండా లాడ్జీలు, ప్రైవేటు బిల్డింగుల్లో వ్యభిచారం జోరుగా సాగుతోంది.

పెరుగుతున్న గన్ కల్చర్

జిల్లాలో తుపాకుల వినియోగం పెరుగుతోంది. ఈ నెల 5న జిల్లా కేంద్రంలోని ఏసీసీలో తుపాకీతో బెదిరించిన పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. నెన్నెల మండలానికి చెందిన జితేందర్ భార్యను కలవడానికి ఏసీసీకి రాగా అక్కడే ఉన్న అన్వేష్ అనే వ్యక్తి తుపాకీతో బెదిరింపుల కు గురి చేశాడు. జితేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితునితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద తుపాకీతోపాటు ఓ ఎయిర్ పిస్టల్, రెండు కత్తులు లభ్యమయ్యాయి.

గతంలో ఓ స్థలం వివాదంలో గోదావరి సమీపంలో శంకర్‌గౌడ్ అనే వ్యక్తిపై మరో వ్యక్తి తుపాకీతో కాల్పులు జరిపి హతమార్చాడు. జిల్లా కేంద్రంలోని ఐబీ గెస్ట్ హౌజ్ వద్ద సెటిల్‌మెంట్లు చేస్తూ గన్‌తో బెదిరించిన కేసులో మల్లారెడ్డి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నస్పూర్‌లో ఓ ఇంట్లో డమ్మీ తుపాకులతో బెదిరింపులకు గురి చేసిన సంఘటన వెలుగు చూసింది. పలువురు బడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, గ్యాంగ్‌స్టర్లు, రాజకీయ నాయకుల వద్ద లైసెన్సులు లేని తుపాకులు జిల్లా కేంద్రంలోనే పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. రోజురోజుకూ విస్తరిస్తున్న అసాంఘిక కార్యకలాపాలను పోలీసుశాఖ కూకటి వేళ్లతోసహా పెకిలించడం ద్వారా ప్రజల భయాందోళనలను దూరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చెరువు సర్వే పనులు ప్రారంభం



భూమి పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సదానందం

భీమారం, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని ఊర చెరువు పూర్తిస్థాయి సర్వే పనులు ప్రారంభమయ్యాయి. భీమారం గ్రామానికి చెందిన తైనేని రవి కలెక్టర్‌కు చెరువును రక్షించాలని ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వారం రోజుల క్రితం సర్వే పనులకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువు వద్దకు రాగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చెరువు సర్వే ఎలా చేస్తారని గ్రామస్థులు పేర్కొనడంతో పనులను నిలిపివేశారు. రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు అందజేసి సోమవారం తహసీల్దార్ సదానందం, ఇరిగేషన్ డీఈ శారదలు ముగ్గురు సర్వేయర్లతో పాత మ్యాప్ ఆధారంగా సర్వే పనులను ప్రారంభించారు. నోటీసులు అందుకున్న బాధితులు వారి వద్ద ఉన్న ఆధారాలతో అధికారుల వద్దకు వచ్చారు. గతేడాది సర్వే చేసిన హద్దులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. చెరువు శిఖం భూముల్లోనే కొందరు ఇండ్లు నిర్మించుకున్నారని, పూర్తిస్థాయి సర్వే అనంతరం హద్దురాళ్ల ఏర్పాటు చేస్తామని సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. చెరువు సర్వే నెంబరు 570లో గతంలో 14 ఎకరాల 39 గుంటల భూమి ఉండేదని, అధికారులు పూర్తిస్థాయి సర్వే చేసి హద్దురాళ్ల ఏర్పాటు చేసి ఆక్రమణదారుల నుంచి చెరువును రక్షించాలని గ్రామస్థులు కోరారు. సర్వే పనులు సాఫీగా జరిగేలా గ్రామస్థులు సహకరించా లని ఎస్‌ఐ రాములు కోరారు. సర్వే సందర్భంగా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఆర్‌ఐ స్రవంతి, సర్వేయర్లు పాల్గొన్నారు.

వందే భారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి

- కేంద్ర మంత్రులకు మాజీ ఎమ్మెల్యే లేఖ

మంచిర్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభమయ్యే సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందే భారత్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలని కేంద్ర మంత్రులు, రైల్వే అధికారులకు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సోమవారం లేఖలు రాశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా ఈ రూట్‌లో ప్రవేశపెట్టే వందే భారత్ రైలుకు సిర్పూర్ కాగజ్‌నగర్, కాజీపేటలో హాల్టింగ్ ఇచ్చి మంచిర్యాలను విస్మరించారన్నారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు సికింద్రాబాద్, కాజీపేట, బల్లార్షా, నాగ్‌పూర్ వెళ్తుంటారని మంచిర్యాలలో రైలు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. వందేభారత్‌కు మంచిర్యాల హాల్టింగ్ కల్పించాలని కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌తోపాటు సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్లకు లేఖలు రాశారు.

హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జైపూర్, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న హెడ్ కుక్ పోస్టు భర్తీకి మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 45 సంవత్సరాలలోపు, స్థానికులై ఉండాలని సూచించారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మండల విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మందమర్రిరూరల్: మండలంలోని కస్తూర్బా విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నామని ఎంఈవో జాడి పోచయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ లోగా ఎంఆర్‌సీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 9: 2024-25 విద్యా సంవత్సరంలో దివ్యాంగ విద్యార్థులు పోస్టు మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, టాప్‌క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాలకు డిగ్రీ, పీజీ, డిప్లొమా చదువుతున్న విద్యార్థులు అక్టోబరు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 9: దీనదయాల్ వికలాంగ పునరావాస పథకం, సమీకృత వృద్ధుల సంక్షేమ పథకాల్లో బాధితులకు పునరావాస కేంద్రాలలో మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వేతర సంస్థలు ఈ నెల 16లోగా సంబంధిత సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు ద్వారా దరఖాస్తులు పంపించాలని సూచించారు.

ఘనంగా సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం

భీమారం, సెప్టెంబరు 9: బూరుగుపల్లిలో సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఎగురవేశారు. నాయకులు గుగులోత్ మల్లేష్, తిరుపతి నాయక్, ధరావత్ శంకర్, మోతిలాల్‌నాయక్, లక్ష్మణ్, రాములునాయక్, ఇస్లావత్ గణేష్, రాజు నాయక్, తిరుపతినాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 9: ప్రజావాణిలో ఆర్జీదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్, నస్పూర్, కోటపల్లి, జన్నారం, దండేపల్లి, పొనకల్ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

- నెన్నెల మండలంలో ఉప్పొంగిన ఎర్రవాగు



ఎర్రవాగును పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కోటపల్లి మండలం కొల్లూరులో 4.4 సెం.మీ, వేమనపల్లి మండలం నీల్వాయిలో 2.7, చెన్నూరులో 2.4, భీమారం మండలంలో 2.2 సెం.మీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా పలు మండలాల్లో వాగులు పొంగి పొర్లాయి.

ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 62,480 క్యూసెక్కులు, వర్షం కారణంగా మరో 75,698 క్యూసెక్కుల వరద చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 148 మీటర్లకుగాను ప్రస్తుతం 147.41 మీటర్ల ఎత్తుకు నీళ్ల చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 18.536 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వరద కొనసాగుతుండటంతో 20 గేట్లు తెరిచి 1,06,860 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో ఉప్పొంగి ప్రవహిస్తోంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జైపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈవో గణపతి పేర్కొన్నారు. సోమవారం ఇందారంలోని గోదావరి నది ఉధృతిని పరిశీలించారు. ప్రజలు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఇందారంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీవో బాపురావు, కార్యదర్శి సుమన్ ఉన్నారు.

నెన్నెల: మండలంలో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని వడ్లవాడలో దురిశెట్టి మల్లయ్యకు చెందిన ఇళ్లు కూలిపోయింది. అందులో నివసిస్తున్న వారు కూలడానికి ముందే బయటకు రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అధికారులు పంచనామా నిర్వహించారు. మండలంలోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. లంబాడితండా సమీపంలోని ఎర్రవాగును తహసీల్దార్ సబ్బ రమేష్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎస్సై ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. వాగు లోలెవల్ వంతెన పై నుంచి ప్రవహిస్తుండటంతో రక్షణ చర్యలు చేపట్టారు. ప్రవాహ ఉధృతి తగ్గే వరకు వాగు దాటవద్దని ప్రజలకు సూచించారు.

బెల్లంపల్లి పట్టణ ప్రజలకు గోదావరి నీరందిస్తా

బెల్లంపల్లి, సెప్టెంబరు 9: బెల్లంపల్లి పట్టణ ప్రజలకు తాగునీటి కోసం గోదావరి నీటిని అందిస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం ఎల్లంపల్లి, బెల్లంపల్లిలోని తాగునీరు సరఫరా చేసే పంప్ హౌజ్‌లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమృత్ పథకంలో భాగంగా రూ.61 కోట్ల నిధులతో ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదావరి నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏండ్లుగా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్య పరిష్కారానికి గోదావరి నీటిని సరఫరా చేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడానని తెలిపారు. త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు.



నెన్నెలలో చెక్కులు అందుకున్న లబ్దిదారులతో ఎమ్మెల్యే వినోద్

మాదక ద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

మాదక ద్రవ్యాల నివారణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. బెల్లంపల్లి బ్రహ్మకుమారీస్ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు కరీంనగర్ జోన్ ఇన్‌చార్జీ బ్రహ్మకుమారీ మనీషా మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల, బజార్ ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర గురుకుల పాఠశాలలలోని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఏసీపీ రవికుమార్, రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, వన్‌టౌన్ సీఐ దేవయ్య, బ్రహ్మకుమారీలు పద్మ, కైవల్య తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నెన్నెల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. 33 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఆర్డీవో హరికృష్ణ, పార్టీ మండల అధ్య క్షుడు గట్టు మల్లేష్, నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, శంకర య్య, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: కన్నెపల్లి రైతు వేదికలో 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో గంగామోహన్ పాల్గొన్నారు.